### స్వదేశీ ఉత్పత్తులతో దీపావళి జరుపుకోండి: గవర్నర్

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): దీపావళి పండుగ సందర్భం గా గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ చెడుపై ధర్మం సాధించిన విజయాన్ని సూచిస్తుందన్నారు. ప్రజల జీవితాల్లో వెలుగులు, సంతోషం, శ్రేయస్సును మరింత మెరుగుపర్చేందుకు, కొత్త ఆలోచనలు, కొత్త ఆదర్శాలను దీపావళి ప్రోత్సహిస్తుందని ఆకాంక్షించారు.

### సంతోషాలు వెల్లివిరియాలి: సీఎం

రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా ఈ పండుగను జరుపుకోవాలన్నారు.

## హామీల అమలులో సర్కార్ విఫలం

**కూనంనేని సాంబశివరావు**

తెలంగాణచౌక్, అక్టోబర్ 30: హామీల అమలులో కాంగ్రెస్ సర్కార్ విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. బుధవారం ఆయన కరీంనగర్‌లో జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డితో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. మహిళలకు ఉచిత గ్యాస్, నెలకు రూ.2,500, కల్యాణ లక్ష్మి పథకం కింద తులం బంగారం, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా కింద పెట్టుబడి సాయం, ఒప్పంద ఉద్యోగులకు జీతాలు చెల్లించడంలో జాప్యం జరుగుతుందని అన్నారు.

మహబూబాబాద్‌లో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ రవీందర్‌రావు, గాంధీనగర్‌లోని ఆంధ్రా కేఫ్ వద్ద మిఠాయిలు తినిపిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

# విద్యుత్తుపై బీఆర్ఎస్ సంబురాలు

- చార్జీల పెంపు ప్రతిపాదన ఉపసంహరణపై హర్షం
- కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం
- పటాకులు కాల్చి, స్వీట్లు పంచిన బీఆర్ఎస్ శ్రేణులు

మహబూబ్‌నగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో పటాకులు కాలుస్తున్న కార్యకర్తలు

నమస్తేతెలంగాణ నెట్‌వర్క్, అక్టోబర్ 30: బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు మిన్నంటాయి. ప్రభుత్వం విద్యుత్తు చార్జీల పెంపు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవడంపై హర్షం వ్యక్తమైంది. గులాబీ పార్టీ నేతల పోరాటంతోనే ప్రజలకు కరెంట్ చార్జీల పెంపు ముప్పు తప్పిందని రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం పటాకులు కాల్చారు. ఇది ముమ్మాటికీ బీఆర్ఎస్ విజయమని నినదించారు. కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పటాకులు కాల్చారు. మిఠాయిలు పంచిపెట్టారు. హైదరాబాద్‌లోని గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ చౌరస్తాలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, పార్టీ నాయకుడు ముఠా జయసింహ శ్రేణులతో కలిసి టపాసులు కాల్చి, స్వీట్లు పంచిపెట్టారు. జగిత్యాలతోపాటు కోరుట్లలో మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, పెద్దపల్లి జిల్లాలో మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, రాజన్న సిరిసిల్ల లో పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నాఫ్స్‌కాబ్ మాజీ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, మహబూబాబాద్‌లో ఎమ్మెల్సీ రవీందర్‌రావు.. కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నెల్లికుదురులో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, వరంగల్‌లో మాజీ ఎమ్మెల్యే నరేందర్, భూపాలపల్లిలో మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి సంబురాలు జరుపుకొన్నారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ తాతా మధు ఆధ్వర్యంలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి.. టపాకులు కాల్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు. భద్రాద్రి జిల్లాలో బీఆర్ఎస్ అధ్యక్షుడు రేగా కాంతారావు ఆధ్వర్యంలో సీట్లు పంపిణీ చేశారు. ఇల్లెందులో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్, మధిరలో కేసీఆర్ చిత్రపటానికి జడ్పీ మాజీ చైర్మన్ కమల్‌రాజు క్షీరాభిషేకం చేశారు. మహబూబ్‌నగర్‌లో మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకొన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా పార్టీ నాయకులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకాలు చేశారు. ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. చెన్నూర్‌లో బీఆర్ఎస్ నాయకులు పటాకులు కాల్చారు. నిర్మల్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లోనూ సంబురాలు జరిగాయి. కామారెడ్డి జిల్లా మద్నూర్‌లో మాజీ ఎమ్మెల్యే హన్మంతు షిండే ఆధ్వర్యంలో బాణాసంచా కాల్చారు.

## అజ్ఞాన అంధకారాన్ని తొలగించేదే దీపావళి: కేసీఆర్

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. మనిషి తనలోని మూర్ఖత్వాన్ని, అజ్ఞానాన్ని తొలగించుకుని జ్ఞాన దీపాలను వెలిగించుకోవాలనే తాత్వికతను దీపావళి పండుగ మనకు అందిస్తుందని చెప్పారు. దీపావళి పర్వదినానికి హిందూ సంస్కృతిలో ప్రత్యేక స్థానం ఉన్నదన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని కేసీఆర్ ఆకాంక్షించారు. అలాగే పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, శాసనమండలిలో విపక్షనేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రాష్ట్ర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

## నువ్వా.. కేసీఆర్ పేరు తుడిచేది?

- ఉద్యమంపై నువ్వు గన్ను ఎక్కుపెడితే..కేసీఆర్ ప్రాణాలనే పణంగా పెట్టిండు
- నువ్వు పదవుల కోసం తపిస్తే.. కేసీఆర్ తృణప్రాయంగా వదిలేసిండు
- రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): 'రేవంత్‌రెడ్డీ.. నువ్వు ఉద్యమకారులపై గన్ను ఎక్కిపెట్టిననాడు కేసీఆర్ ఉద్యమానికి తన ప్రాణాలనే పణంగా పెట్టిండు. నువ్వు చెప్పు మోసిననాడు కేసీఆర్ ఉద్యమానికి ఊపిరిపోసిండు. నువ్వు పదవుల కోసం పరితపిస్తున్ననాడు.. ఉన్న పదవిని కేసీఆర్ తృణప్రాయంగా వదిలేసిండు. సాధించుకున్న తెలంగాణను నువ్వు చంపేందుకు బ్యాగులు మోస్తున్ననాడు కేసీఆర్ తెలంగాణ భవిష్యత్తుకు ఊపిరి పోసిండు.. చిట్టినాయుడూ.. నువ్వా కేసీఆర్ పేరును తుడిచేది?' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయడమే తన లక్ష్యమని మాట్లాడిన రేవంత్ తీరుపై కేటీఆర్ బుధవారం ఎక్స్ వేదికగా మండిపడ్డారు.

**దామగుండం ధనాధన్.. ధాన్యం కొనుగోళ్లు ఢాం**

రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు దిక్కులేదని కేటీఆర్ మండిపడ్డారు. 'మూసీపై ముందుకు ధాన్యం కొనుగోళ్లపై వెనక్కా?' అని ప్రశ్నించారు. 'దామగుండం ధనాధన్.. ధాన్యం కొనుగోళ్లు ఢాం.. ఢాం..కొనుగోళ్లకు దిక్కులేదు.. కాంగ్రెస్ కోతలకు కొదవలేదు' అని ఎద్దేవాచేశారు. దళారులకు దండిగా..రైతన్నకు సర్కార్ దండుగలా మారిందని నిప్పులు చెరిగారు. నాడు క్వింటాకు రూ.2300కు అమ్ముకున్న రైతు, కాంగ్రెస్ పుణ్యమా అని నేడు రూ. 1800కే అమ్ముకుంటున్నాడని ఆవేదన వ్యక్తంచేశారు. 'ఎద్దు ఏడ్చిన ఎవుసం.. రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడదనే సోయి సర్కార్‌కు ఉండాలి' అని సూచించారు.

## కేసీఆర్ చరిత్రను చెరిపే దమ్ము ఎవరికీ లేదు

- బీఆర్ఎస్ పోరాటంతోనే విద్యుత్తు చార్జీల పెంపు ఉపసంహరణ
- ప్రజలపై రూ.1,850 కోట్ల భారాన్ని ఆపిన ఘనత బీఆర్ఎస్‌దే
- ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

మాట్లాడుతున్న తాతా మధుసూదన్,

ఖమ్మం, అక్టోబర్ 30: వెయ్యిమంది రేవంత్ రెడ్డిలు వచ్చినా తెలంగాణలో కేసీఆర్ చరిత్రను తుడిచివేయలేరని, తెలంగాణ ఉన్నంత వరకు కేసీఆర్ సజీవంగా నిలిచి ఉంటారని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ స్పష్టంచేశారు. బుధవారం ఖమ్మం లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీయ్యతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ ఉద్య మం అంటే ఏమిటో తెలియని రేవంత్.. కేసీఆర్ చరిత్రను లేకుండా చేయడమంటే.. తెలంగాణ రాష్ట్రాన్ని లేకుండా చేయడమేనని, ఒకవేళ తెలంగాణను ఆంధ్రప్రదేశ్‌లో కలుపుతాడేమోనని అనుమానం వ్యక్తంచేశారు. తెలంగాణ ఉద్యమకారులపై తుపాకీ ఎక్కుపెట్టిన రేవంత్‌కు త్యాగాల గురించి ఏం తెలుసుని ప్రశ్నించారు. బీఆర్ఎస్ చేసిన పోరాటం, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు చేసిన కృషి ఫలితంగానే తెలంగాణ ప్రజలపై రూ.18,500 కోట్ల విద్యుత్తు చార్జీల భారం పడకుండా ఆగిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ 11 నెలల కాలంలో ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు.

## సీఎంది వీధిరౌడీ భాష: దాసోజు శ్రవణ్

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలకు తొలి ప్రతినిధి అయిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భాష వీధిరౌడీ కన్నా అధ్వానంగా ఉన్నదని బీఆర్ఎస్ నేత డాక్టర్ దాసోజు శ్రవణ్ విమర్శించారు. " కేసీఆర్‌ను ఒక సంవత్సరంలో ఫినిష్ చేస్తా? కేటీఆర్‌ను హరీశ్‌రావుతో ఫినిష్ చేయిస్తా అంటావా? సీఎం వాడాల్సిన భాషేనా?" అని ధ్వజమెత్తారు. గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్‌లాగా, దావూద్ ఇబ్రహీంలా రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ బుధవారం మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థానంలో ఉన్నవారు తెలంగాణ ప్రజలకు ఆదర్శుడిగా ఉండాలి కానీ, కనకపు సింహాసనమున శునకము కూర్చుండ బెట్టినట్టుగా ఉండవద్దని హితవు పలికారు. ప్రతిపక్ష నేతను ఫినిష్ చేయడానికి, ఇండ్లు కూల్చడానికి రేవంత్‌ను సీఎంను చేశారా? అని అన్నారు. క్రిమినల్ సీఎంలా రేవంత్ పద్ధతి ఉన్నదని, రాష్ట్రాన్ని నడుపుతున్న వ్యక్తి క్రిమినల్ అయితే ఇక సమాజం ఎట్లా? అని ప్రశ్నించారు. సీఎం సీటులో కూర్చున్నాక కూడా రేవంత్ మారడం లేదని, కుక్కతోక వంకర అన్నట్టుగా వ్యవహరిస్తున్నారని విమర్శలు గుప్పించారు.

**కేసీఆర్ లివింగ్ లెజెండ్**

"లివింగ్ లెజెండ్ కేసీఆర్‌ను ఫినిష్ చేస్తా అంటావా? రేవంత్ అసలు నువ్వు మనిషేనా?" అని దాసోజు ప్రశ్నించారు. రేవంత్ ముఖ్యమంత్రా? లేక ఆంధ్రపాలకుల పాలెగాడా? అని నిలదీశారు. "రేవంత్ సమైక్యవాదుల చెప్పులు మోస్తున్నపుడు కేసీఆర్ తెలంగాణ ఉద్యమానికి ఊపిరి పోస్తున్నారు. కేసీఆర్ పేరు మార్చడానికి గోడ మీద పెయింట్ కాదు.. తెలంగాణ ఆత్మ కేసీఆర్. రేవంత్ కూర్చుంటున్న సచివాలయం కేసీఆర్ కట్టిందే, నడుస్తున్న రోడ్లు కేసీఆర్ నిర్మించినవే, తాగుతున్న నీళ్లు కేసీఆర్ మిషన్ భగీరథ ద్వారా తెచ్చినవే" అని పేర్కొన్నారు.

## కొండంత కేసీఆర్.. రవ్వంత రేవంత్

- కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామనడం మూర్ఖత్వం
- కేసీఆర్ తెలంగాణ సర్వనామం: మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉన్నన్నినాళ్లు కేసీఆర్ ఉంటారని, కొండంత కేసీఆర్‌ను రవ్వంత రేవంత్‌రెడ్డి ఏమీ చేయలేడని అని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్‌ను ఏదో చేస్తానని అనుకోవడం సీఎం రేవంత్‌రెడ్డి మూర్ఖత్వం అని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అంటే తెలంగాణ సర్వనామం అని, ప్రతి గుండెలో కేసీఆర్ ఉంటారని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నంబర్ 1గా తీర్చిదిద్దిన కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి అవాకులు చెవాకులు పేలటం దుర్మార్గమని మండిపడ్డారు.

**తెలంగాణ గుండె చప్పుడు కేసీఆర్ : మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

తెలంగాణ ప్రజల గుండెచప్పుడు కేసీఆర్ అనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తెలుసుకోవాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రజలు తాగే మిషన్ భగీరథ నీళ్లలో... గ్రామాల్లో, పట్టణాల్లో పచ్చని చెట్లలో.. కాళేశ్వరం జల సవ్వడిలో, కాకతీయ చెరువు మత్తడిలో, విద్యుత్తు వెలుగుల్లో, గురుకుల బడుల్లో, యాదాద్రి గుడిలో, జిల్లాకో వైద్య కళాశాల విప్లవంలో.. ఇలా అడుగడుగునా కేసీఆర్ ఉన్నారనే స్పృహతో రేవంత్‌రెడ్డి వ్యవహరించాలని హితువు పలికారు.

**పొంగులేటి.. చరిత్ర తెలుసుకో: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**

మంత్రి పొంగులేటి టి చరిత్ర తెలుసుకొని మాట్లాడాలని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సూచించారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని, తామూ అధికారంలోకి వస్తామనే విషయాన్ని పొంగులేటి విస్మరించారని మండిపడ్డారు. కేసీఆర్ ఆనవాళ్లను చెరిపివేయటం రేవంత్‌రెడ్డి అండ్ కో తరం కాదన్నారు.

**సీఎం రేవంత్ ఆత్మపరిశీలన చేసుకోవాలి : బీఆర్ఎస్వీ నేత తుంగబాలు**

రేవంత్‌రెడ్డి ఆత్మపరిశీలన చేసుకోవాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు సూచించారు. ఏడాది లో కేసీఆర్ పేరు ఉండదు అంటుంటే అసలు నువ్వు ఉంటావా? అని ప్రశ్నించారు. చరిత్రలో అన్నదమ్ముల విభేదాలతోనే యుద్ధాలు వచ్చాయని.. మీ అన్నదమ్ముల నుంచే ప్రాణహానీ ఉందేమో కనుక్కోఅని రేవంత్‌కు హితవుపలికారు.

## పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్నది

**ఎంపీ రఘునందన్ రావు ఫైర్**

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేస్తున్నదని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. కేంద్రం ఆరు నెలల క్రితం ఉపాధి హామీ పథకం కింద రూ.1200 కోట్లు విడుదల చేసిందని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని పంచాయతీలకు విడుదల చేయలేదని ఆరోపించారు.

## హాస్టల్ మెస్ చార్జీలు పెంపు

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులకు సంబంధించిన మెస్ చార్జీలను పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో గురుకులాలు, హాస్టళ్లలోని మొత్తంగా 8 లక్షల 50వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వమే ఈ మేరకు నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్టులు పెట్టారంటూ

- టైర్ బెల్టుతో బీఆర్ఎస్ కార్యకర్తను చితకబాదిన సీఐ
- బాధితుడితో కలిసి స్టేషన్‌ను ముట్టడించిన శ్రీనివాస్‌గౌడ్
- కేటీఆర్ ఫోన్.. భయపడొద్దంటూ బాధితుడికి ధైర్యం
- దిగొచ్చిన సీఐ.. ఆందోళన విరమణ



మహబూబ్‌నగర్ వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగిన మా పార్టీ కార్యకర్తను ఎందుకు కొట్టారని సీఐని నిలదీస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్/హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతూ.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్ వరద భాస్కర్ ముదిరాజ్‌పై పోలీసులు జులుం ప్రదర్శించడాన్ని నిరసిస్తూ.. మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బుధవారం పీఎస్‌ను ముట్టడించారు. అక్కడ బైఠాయించి భాస్కర్‌ను చితకబాదిన సీఐపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెంటనే శ్రీనివాస్‌గౌడ్‌కు ఫోన్ చేయగా.. ఆయన మహబూబ్‌నగర్ టౌన్ పోలీసుల దౌర్జన్యాన్ని వివరించారు. 'పోలీసుల వేధింపులు, బెదిరింపులకు భయపడొద్దు. మీకు మేమున్నాం' అంటూ ధైర్యం చెప్పారు. ఫోన్లో బాధితుడిని పరామర్శించిన కేటీఆర్.. సీఐపై చట్టప్రకారం ముందుకు వెళ్తామని, ఉన్నతాధికారులతో మాట్లాడుతానని భరోసా ఇచ్చారు. దీంతో దిగొచ్చిన సీఐ.. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కావని హామీ ఇవ్వడంతో బీఆర్ఎస్ నేతలు ఆందోళన విరమించారు.

**బాధితుడి ఇంటి నుంచి వన్‌టౌన్‌కు ర్యాలీ**

సోషల్ మీడియాలో ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను ప్రశ్నిస్తూ పోస్టుపెట్టిన మహబూబ్‌నగర్‌కు చెందిన గులాబీ పార్టీ కార్యకర్త భాస్కర్‌ను పీఎస్‌కి పిలిపించి సీఐ అప్పయ్య చితకబాదారు. దీంతో భాస్కర్‌ను పరామర్శించడానికి శ్రీనివాస్‌గౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, ఆంజనేయగౌడ్, నేతలు బాధితుడి ఇంటికి వెళ్లారు. సీఐ చితకబాదిన గాయాలను వారికి చూపించాడు. దీంతో ఆగ్రహించిన నాయకులు.. భాస్కర్ ఇంటి నుంచి ర్యాలీగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని అక్కడ బైఠాయించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోస్ట్‌లు పెట్టినందుకు దుర్భాషలాడటంతోపాటు చితకబాదడం ఏమిటని సీఐని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తుందని.. చట్టాన్ని అతిక్రమించి పనిచేసిన అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న విషయాన్ని తెలుసుకున్న ఉన్నతాధికారులు సీఐపై ఆగ్రహం వ్యక్తంచేసినట్టు సమాచారం. దీంతో దిగొచ్చిన సీఐ అప్పయ్య మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

## అవినీతి, వసూళ్ల ఊబిలో రాష్ట్రం

**బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి**

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో ఇప్పటివరకు రూ.1,150 కోట్ల భారీ కుంభకోణం జరిగిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం తాజాగా తెచ్చిన జీవో 27 ఆ శాఖలో అవినీతిని మరింత పెంచేలా ఉన్నదని ధ్వజమెత్తారు. 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం తరలింపునకు గడువు పూర్తయి 5 నెలలైనా కాంట్రాక్టర్లపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇదే రూ.800 కోట్ల వరకు కుంభకోణమని ఆరోపించారు.

### మాకు న్యాయం చేయండి!

- ఐఏఎస్‌లపై ఈడీకి ఫిర్యాదు!

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): ముగ్గురు ఐఏఎస్‌లపై హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయంలో ఫిర్యాదు నమోదైంది. బుధవారం నవీన్‌మిట్టల్, సోమేశ్‌కుమార్, అమోయ్‌కుమార్‌పై భూ బాధితులు ఈడీకి ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. దీపావళి తర్వాత ఆ ఐఏఎస్‌లను ఈడీ విచారించనున్నట్టు తెలిసింది.

## మోతీలాల్ నాయక్ విడుదల

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ) : గ్రూప్-1 పరీక్ష వాయిదా వేయాలన్న డిమాండ్‌తో గాంధీ భవన్‌ను ముట్టడించి అరెస్టయిన మోతీలాల్‌నాయక్ బుధవారం చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. 10 రోజులుగా ఆ యన జైలులో ఉన్నారు. విడుదల సందర్భంగా మోతీలాల్ మాట్లాడు తూ 'నిరుద్యోగులను నిండా ముంచి న రేవంత్.. ఖబర్దార్.. నిన్ను చీకట్లో పెట్టే రోజులు వస్తయ్' అని హెచ్చరించారు.

## 6 వేల పెన్షన్ ఎప్పుడిస్తరు?

*'కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దివ్యాంగులకు నెలనెలా రూ.6 వేల పెన్షన్ ఇస్తం. ఇతర రాయితీలు కల్పిస్తం. ఆత్మగౌరవంతో బతికేలా చేస్తం. ఇవన్నీ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల వ్యవధిలోనే అమలు చేస్తామని గొప్పలు చెప్పిన్రు. ఇప్పుడు మూడు వందల రోజులైంది. ఆరువేల పెన్షన్ ఊసే లేదు. ఇంకెప్పుడు ఇస్తరు?' అంటూ ప్రభుత్వంపై దివ్యాంగులు ఆగ్రహించారు. అష్టకష్టాలు పడుతూ బుధవారం జగిత్యాల కలెక్టరేట్‌కు చేరుకొని.. అక్కడే బైఠాయించి ధర్నా చేశారు. 40 నిమిషాలపాటు నిరసన తెలిపారు. కలెక్టర్‌ను కలిసేందుకు అనుమతించాలని ఉన్నతాధికారులను కోరగా.. వారు నిరాకరించారు. చివరకు దివ్యాంగులు జిల్లా సంక్షేమాధికారికి వినతిపత్రాన్ని అందజేశారు.* –జగిత్యాల

## డబ్బాలు పట్టుకొని రెడీగా ఉన్నాం

- డ్రగ్ టెస్టుకు రమ్మంటే కాంగ్రెస్ నేతలు రారెందుకు?
- మీరేమైనా డ్రగ్స్ తీసుకున్నరా? మరి భయమెందుకు?
- బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్

హైదరాబాద్, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): డ్రగ్ టెస్టుకు డబ్బాలు పట్టుకొని రెడీగా ఉన్నామని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి చెప్పారు. డ్రగ్ టెస్టులకు రమ్మంటే కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎందుకు రావడం లేదు? మీరేమైనా డ్రగ్స్ తీసుకున్నరా? మరి భయమెందుకు? అని నిలదీశారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ సవాల్‌ను తాము స్వీకరించామని, డ్రగ్ టెస్టుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నారని, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా రావాలని డిమాండ్ చేసినట్టు తెలిపారు. కానీ, అనిల్‌కుమార్ ఎవరికీ చెప్పకుండా దవాఖానకు వెళ్లి రమ్మంటే ఎట్లా? అని ప్రశ్నించారు. తన పంచాయితీ అనిల్‌కుమార్‌తో కాదని, రేవంత్‌రెడ్డితోనే అని తేల్చి చెప్పారు. డ్రగ్స్ కేసులో తనను ఇరికించాలని రేవంత్ కుట్ర పన్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాము కౌశిక్‌రెడ్డిని ట్రాప్ చేయలేదని ప్రెస్‌మీట్ ద్వారా ఇంటెలిజెన్స్ చీఫ్‌ను చెప్పమను.. అని రేవంత్‌కు సవాల్ విసిరారు.